


*(1991 ఏప్రిల్ నెల చతుర నుంచి రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*

*(గత సంచిక తరువాయి)*

**ఇంతలోతుగా ఆలోచించే** తను 'రావ్' తండ్రి విషయంలో ఏమన్నాడు? సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నాడని కదూ. ఆయనతో ఆ మాటలు అన్నప్పుడు తన మానసికస్థితి ఏమిటి?

ఆందోళన.. భయం..

అవును అవే తనను సైతం ఓ నిముషం ఉక్కిరిబిక్కిరి చేసినవి అవే.

ఏ అర్ధరాత్రో గుంపులు గుంపులుగా వచ్చి విధ్వంసం సృష్టిస్తారంట. ఇది ఎంతవరకు నిజం? ఇది కేవలం బెదిరింపా? కాకపోవచ్చు. ఇంతకుముందూ ఇలాంటి పుకార్లు వచ్చాయి. అవి నిజం కాదులే అనుకున్నారు. ఇప్పుడు అన్నీ నిజం అయ్యాయి. అంతేకాదు. ఎప్పుడూ ఊహించనివి కూడా జరిగిపోయాయి.

బహుశా ఆ భయంతోనే తను అలా మాట్లడి ఉంటాడు. లేకపోతే 'రావ్' ది సెంటిమెంట్ మాత్రమే ఎలా అవుతుంది. ఆ సమస్యను అంతకుమించి చూడాల్సి ఉంది. నిజంగా తను రచయిత కాదు. కవికాదు, పాఠకుడు మాత్రమే. అందులోనూ మంచి పాఠకుడు అవునో కాదో కూడా తనకు తెలియదు. నిజానికి జరుగుతున్న చరిత్రనంతా చిత్రీకరించాల్సివస్తే ఎంత హృదయవిదారకమైన పరిస్థితి ఇది.

ఏది ఏమైనా ఇది తనకు కూడా ఓ సవాలే భూషయ్యగారి శవాన్ని ఇక్కడినుండి తీసుకువెళ్ళాలి, ముందు ఈ నగరపు పొలిమేరలనుండి బయటపడాలి. ముందు అందుకు ఇంట్లో అంగీకరిస్తారా?

"ఏమోయ్" అంటూ పిలిచాడు.

ఆమె వచ్చింది.

"ఏం చేస్తున్నారు?"

"ఏముంది చెయ్యటానికి టి.వి చూస్తున్నాం."

"ఇప్పుడా?"

అవును మరి. ఇప్పుడేగా తీరిక. వీడియో కేసెట్ పెట్టారు పిల్లలు"

"ఏం సినిమా?"

"ఏమో ఏదో ఇంగ్లీష్ సినిమా నాకు అర్థంకావటంలేదు."

గంగాధర్ లేచి వెళ్ళాడు.

ఓ బీభత్సరస ప్రధానమైన సినిమాని అత్యంత ఉత్కంఠతో చూస్తున్నారు పిల్లలు. గంగాధర్‌కి ఆ క్షణం తనకు తెలియకుండానే కోపం వచ్చింది. తనను తాను నిగ్రహించుకున్నాడు.

"పాపా" ఎంత సౌమ్యంగా పిలవాలనుకున్నా ఆ కంఠంలో కొంత కఠినత్వం చోటుచేసుకుంది.

ఒక్కసారిగా టి.వి ఆగిపోయింది.

"ఏంటి నాన్నగారూ?" అంటూ వచ్చింది.

"ఏ సినిమా అమ్మా అది?"

ఆ కంఠస్వరంలో కనిపిస్తున్న తీవ్రతను ఆ అమ్మాయి గ్రహించింది.

"నా ఫ్రెండ్ ఇచ్చింది."

"అంత బాగుందా?"

ఆ అమ్మాయి తలవంచుకుంది.

గంగాధర్‌కి జాలి కలిగింది. మామూలుగా అయితే ఎలాంటి పుస్తకం చదివినా, ఎలాంటి సినిమా చూసినా కూడా ఎటువంటి అభ్యంతరం పెట్టడు. అలాంటిది ఇప్పుడు తన మానసిక స్థితివేరు.

"ఆ హింసాత్మక సినిమాల్లో అంత ఆనందం కనిపిస్తుందా?" నవ్వుతూ అన్నాడు.

"ఆనందం కాదు డాడీ. ఆ తర్వాతేం జరుగుతుందో అని సస్పెన్స్"

"చార్లీ చాప్లిన్ క్యాసెట్లున్నాయి కదా. అవేం ఆనందం కలిగించటంలేదా?"

"బాగుంటాయి డాడీ. అయినా అవి రాత్రిపూట చూస్తే హాయిగా ఉంటుంది."

"ఈ సినిమాలు మాత్రం పగలే చూడాలంటావ్?"

"అలా అని కాదు డాడీ. చాలా బాగుంది చూడమంటూ తను గొడవచేసింది."

"అది సరేనమ్మా ఓ పక్కన ప్రపంచం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నట్లు అలాంటి సినిమాలు చూస్తావా?"

తిరిగి ఆ అమ్మాయి తలవంచుకుంది.

"సరే రండి. చిన్నమ్మాయిని కూడా పిలువ్. మీ అందరితోనూ మాట్లాడాలి."

అందరూ హాల్లోకి వచ్చారు.

మన సాంబశివరావు అంకుల్ నాన్నగారు చచ్చిపోయారు. ఇంకా మీకు చెప్పలేదు కదా"

"అయ్యో.. ఎప్పుడు?" అన్నారు పిల్లలు.

"ఈ రోజే అంకుల్ ఫోన్ చేసి చెప్పారు"

"పాపం" అంటూ జాలిపడ్డారు.

"ఇప్పుడు వాళ్ళింట్లో తాతగారి డెడ్‌బాడీ ఉంది. అది తీసుకుని ఇంటికి వెళ్ళాలి"

"ఏ ఇంటికి?"

"అంటే తాతగారి ఊరన్నమాట."

"ఎలా డాడీ?"

"ఎలా అయినా సరే తీసుకువెళ్ళాలి."

"అంతదూరం ఎలా కుదురుతుంది. అయినా కర్ఫ్యూ ఉందిగా డాడీ."

"అవును అయినా సరే తీసుకు వెళ్ళాలి. అంకుల్ కారు గేరేజ్‌లోనే ఉండిపోయింది. లేకపోతే ఈపాటికి తను ధైర్యం చేసి తీసుకువెళ్ళేవాడే"

"మరి ఇప్పుడెలా?"

"అదే ఆలోచిస్తున్నా."

"పోనీ ఆ కార్యక్రమం ఇక్కడే పూర్తిచేస్తే సరిపోతుంది కదా" అంది ఆయన భార్య.

"లేదు ముసలాయనకి కావలసిన వారందరూ ఆయన ఊర్లో ఉన్నారు. ముందు రావుగారి అమ్మకి ఈ విషయం తెలియదు. అంతదూరం నుండి ఆమె ఇక్కడకు రాలేదు కదా? అందులోనూ ఈ వార్త వింటే ఆమె పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం కదా, అందుకని ఎలా అయినా సరే వెళ్ళాలి."

"మరి ఇప్పుడేం చేయాలని?" అనుమానంగా అడిగిందామె.

"ఏం లేదు. మన కారు తీసుకుని అంకుల్ వారింటికి వెళ్దామనుకుంటున్నా."

"ఇప్పుడా?" అందామె నోరు తెరుస్తూ.

"అవును. ఇప్పుడే"

"మీకేమైనా మతి ఉండి మాట్లాడుతున్నారా? కర్ఫ్యూ ఉంది. బయటకి వెళితే ఊరుకుంటారా?"

"ఊరుకోక ఏం చేస్తారు? అంతగా అయితే నా కారు ఆపి అడుగుతారు అంతేగా"

"అప్పుడేం చేస్తారు."

"చేసేదేముంది విషయం చెబుతా"

"మరి వాళ్ళు నమ్మాలిగా."

"నమ్మకపోతే ఫోన్ చేయమని చెబుతాను. లేదా నా వెంట రమ్మని చెబుతాను."

"నాకేదో భయంగా ఉందండి" అందామె పడాల్సిందేం లేదు. అసలు పోలీసులు నా కారుని ఆపటమే మంచిది. వాళ్ళను తీసుకెళ్ళి ముందు అంకుల్ ఇంటిలోని డెడ్‌బాడీని చూపించి సిటీ లిమిట్స్‌దాకా పంపించమని చెప్పొచ్చు."

"కనిపిస్తే కాల్చేస్తామని చెబుతున్నారు కదండి" అందామె.

"ఊరికెనే అలా చెబుతారు" అన్నాడు గంగాధర్.

"మీరు అన్నీ అలానే చెబుతారు. అయినా పోలీసులు కాకపోతే రౌడీలు కారునాపి ఏమైనా చేయొచ్చుగా."

"అదేంకాదు. మీరేం కంగారు పడొద్దు."

"చాల్లే ఊరుకోండి. ఇప్పుడు వెళ్తానంటారేమిటి? అంతగా అయితే మేం అందరం వస్తాం. ఏమన్నా జరిగితే అందరికీ జరుగుతుంది."

గంగాధర్ తన భార్య కేసి సూటిగా చూశాడు. ఆమె మాత్రం రాజీపడనిదానిలా కనిపించింది.

"ఏమిటంత మూర్ఖంగా మాట్లాడతావు?"

"నేనేం మాట్లాడటంలేదు. మీరే మూర్ఖంగా ఉన్నారు."

"పరిస్థితిని కూడా గమనించాలి కదా"

"అయితే మాత్రం ఓ పక్కనుండి మనుషుల్ని వరసగా నరుక్కుంటూ వస్తున్నారు. ఇందాకే కదా ఎవరో ఫోన్ చేసి అర్ధరాత్రి అంతా తగలబెడతాం అన్నారన్నారు. ఇలాంటప్పుడు కారు బయటకు తీస్తానంటారేమిటి? ఎవరన్నా రాళ్ళు విసిరినా అద్దాలు పగిలినా బాగుచేయించుకోవచ్చు అంతేగానీ"

"అంటే ఏం చేయమంటావ్?"

"అది సాంబశివరావుగారు నిర్ణయించుకుంటారు. అయినా ఏదో స్నేహితుడు వాళ్ళ నాన్నగారు చచ్చిపోయారు. నిజమే మనకీ బాధ ఉంది. అంతా బాగుంటే మనం వెళ్ళి చూసి వస్తాం. మన కారిచ్చి పంపిస్తాం. అంతేగాని తనకు మాలిన ధర్మం పనికిరాదని పెద్దలు ఊరికినే చెప్పారా?" అందామె కోపంగా.

గంగాధర్‌కి నవ్వు వచ్చింది.

"అలా నవ్వకండి. నాకు చిరాకుగా ఉంటుంది. నేనిలా అంటున్నాను అని కాకుండా ఆలోచించండి. వాళ్ళ నాన్నగారు చచ్చిపోయారు కాబట్టి అందరూ ఆయన్తోపాటు పోలేరుకదా"

"అదేమిటి?"

"మీరు చెప్పేది అలానే ఉంది. వాళ్ళమ్మగారు లేని మాట నిజమే. ఇప్పుడు ఆయన ఆ ఊర్లోనే పోయి ఉంటే మూడు రోజులపాటు శవాన్ని ఆపుతారా? ఓ వేళ ఆపుతారనే అనుకుందాం. ప్రాణాలకు తెగించి ఇలా చేయకపోతే ఆ మాత్రం అర్థంచేసుకోలేదా?" అంది.

గంగాధర్ ఆమెకేసే చూస్తుండిపోయాడు. తను అలా మౌనంగా కూర్చుంటే ఆ వాదం ఎంత బలంగా తనమీద ప్రభావం చూపిస్తుందంటే తను కదలలేడు. కారు తీసుకుని బయటకు వెళ్ళటానికి ధైర్యం చాలదు.

బహుశా రావ్ తండ్రిని కోల్పోయిన షాక్‌లో మిగతా విషయాల గురించి ఆలోచించడు. పూర్తిగా తన మీద ఆధారపడిన స్థితిలో అతన్ని వంటరిగా వదిలి వేయటం కూడా సమజసం కాదు. అలా అని చెప్పి ఇంట్లో వారిని ఏడిపించి తను బయటకు వెళ్ళటమూ ఇష్టంలేదు. ముందు ఆలోచించుకోవాలి.

"సరేగాని నాక్కొంచెం కాఫీ ఇస్తావా?" అన్నాడు.

"ఎందుకివ్వను. నేను చెప్పదలుచుకుంది చెప్పాను. ఆ తర్వాత మీ ఇష్టం. నా మాటను మీరు లెక్కచేయరని నాకు తెలుసు" అంటూ ఆమె లోపలకి వెళ్ళిపోయింది.

"అమ్మాయి నా గదికి వెళ్దాం రా" అంటూ తీసుకు వెళ్ళాడు తనతో పాటు పెద్ద కూతురిని.

"మీ అమ్మ మాటలు విన్నావుగా నీ అభిప్రాయం చెప్పు"

"అమ్మ భయపడుతుంది డాడీ"

"నీకు భయంగా లేదా?"

"ఎందుకు లేదు డాడీ. మీరు బయటకు వెళ్ళిందగ్గర్నుండి ఏం జరుగుతుందా అనే టెన్షనేగా?"

"మరి మీకు ఏం జరుగుతుందా అనే ఉత్కంఠ మాత్రమేగా కావల్సింది" అన్నాడు.

"అది సినిమా కదా" అంది.

"పోనీ ఇది జీవితం ఉత్కంఠ అనేది సినిమాలోనే కాదు జీవితంలోనూ ఉందని మనం చూస్తున్నాం. దానికి మరో కోణం సాహసం. అది కూడా జీవితానికి అవసరమే కదా."

"అది కాదు డాడీ"

"ముందు నాకు జవాబు చెప్పమ్మా"

"అవసరమే" అంది.

"అందుకే నేను అంకుల్ దగ్గరకి వెళ్ళాలి. మీ అమ్మకి ఇంకా మీలా రాంబోలాంటి సినిమాలు చూసి మెచ్చుకునే స్థాయి రాలా, తనింకా పాతకాలం మనిషే. నాకేమవుతుందో అని భయపడుతుంది. ఏమీ కాదని మీరు ధైర్యం చెప్పాలి అర్థమైందా?"

"అమ్మ వినదుగా డాడీ"

"ఎందుకు వినదు. తప్పకుండా వింటుంది. ముందు నువ్వు చెప్పు. నేను వెళ్ళటం నీకు ఇష్టమేకదా"

ఆ అమ్మాయి కొద్దిగా సంశయించి చెప్పింది.

"అంతగా అవసరం అనుకుంటే తప్పదుగా."

"అవసరమేనమ్మా రావ్ అంకుల్ గురించి మీకు తెలియదు. ఆయనలో చాలా మంచి లక్షణాలున్నాయి. స్నేహంకోసం ప్రాణం ఇస్తాడు. నిజంగా వాళ్ళ నాన్నగారిని గమనించాక అంకుల్. ఎందుకంత మంచి అలవాట్లు చేసుకోగలిగారో అర్థమైంది. ఆయన కష్టంలో వుంటే మనం భయపడుతూ కూర్చుంటే జీవితాంతం సిగ్గుపడాల్సి ఉంటుంది. అలాంటిదే మనకు జరిగివుంటే తనుమాత్రం సంశయించేవాడుకాదు."

"ఆయన ఎందుకు చనిపోయారు డాడీ."

"ఏమోనమ్మా పెద్దాయనకదా. వయసు కూడా వచ్చిందనుకో. అయినా రాత్రిదాకా బాగానే ఉన్నాడంట. అన్నీ బాగుంటే ఉదయం తన ఊరికి వెళ్ళాల్సిన వ్యక్తి ఆయన."

"మరిప్పుడేం చేద్దాం డాడీ" అంది.

"ఏముందమ్మా వెళ్ళటం వెళ్ళటమే. అయితే మీరు ఏడ్పులూ, పెడబొబ్బలూ పెడుతూ కూర్చుంటే నేను ఆ ఆలోచనల్తో వర్రీ అవుతాను. నాకేం కాదు. కర్ఫ్యూ అన్నాక మనం భయపడాలి. వాళ్ళూ అంత స్ట్రిక్టుగా ఉండలేరు. అయినా ఏదన్నా జరిగితే అనొచ్చు. ఆ జరిగేది ఇంటిలో కూర్చుంటే మాత్రం జరగదనేమిటి? ఇలాంటప్పుడు ఎంత ధైర్యం అవసరమో అంత వేదాంతం కూడా అనవసరం."

ఆ అమ్మాయి నవ్వింది.

"అందుకని నువ్వో పని చెయ్యి. ముందు మీ అమ్మకి ధైర్యం చెప్పు. నేను వీలయితే కారు యిచ్చి వెనక్కి రావటానికి ప్రయత్నం చేస్తా. అంతగా అయితే నాకు తెలిసిన పోలీస్ ఆఫీసర్స్ కనిపిస్తే దిగులేలేదు. నేను అంకుల్ ఇంటికి వెళ్ళగానే నీకు ఫోన్ చేసి చెబుతా. నువ్వే మాట్లాడు. ఓవేళ మేం వెళ్ళాల్సి వస్తే అక్కడినుండి చెబుతా. అయినా ఇందులో భయపడాల్సిందేం లేదు. రెండు మూడు రోజుల్లో పరిస్థితులన్నీ మామూలుకావచ్చు" అన్నాడు.

"అలాగే డాడీ"

"ఇంకో విషయం మీకు అంతగా భయం అనుకుంటే కంట్రోల్ రూంకి ఫోన్ చేయండి. ఎవరన్నా ఫోన్లు చేసి పుకార్ల గురించి చెప్పినా, ఇంకేమైనా బెదిరించినా మీరేం పట్టించుకోవద్దు. అర్థమైందా?"

"అలాగే"

"నేను తయారవుతుంటాను. ముందు మీ అమ్మకి నచ్చచెప్పు."

ఆ అమ్మాయి ఉత్సాహంగా లేచి వెళ్ళింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS